
Email : telanganaveenaoffcial@gmail.com
Title Code : 12280
# తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
http://Epepar.telanganaveena.com | గురువారం జూన్ 5 2025 | సంపుటి:2 | సంచి 249 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-









## ఆర్‌సీబీ విజయోత్సాహంలో
# ఘోర విషాదం
## ఘటనలో పదిమంది మృతి....50మందికి గాయాలు

- చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట
- భారీగా తరలివచ్చిన అభిమానులతో స్టేడియం వద్ద తోపులాట
- ఆర్‌సిబి విజయోత్సవ సభలో అపశృతి
- కంట్రోల్ చేయలేక చేతులెత్తేసిన బెంగళూరు పోలీసులు
- బెంగుళూరు చేరుకున్న ఆర్‌సీబీ జట్టుకు డిప్యూటి సీఎం స్వాగతం


**తెలంగాణ వీణబెంగళూరు,**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం దగ్గర అపశ్రుతి చోటు చేసుకుంది. ఆర్‌సిబి విజయోత్సాహంలో విషాదం చోటుచేసుకుంది. క్రికెటర్ల విజయోత్సవాతన్ని కళ్లారాచూడాలని తరలివచ్చిన అభిమానుల తోపులాట తొక్కిసలాటకు దారితీసింది. ఈ క్రమంలో పదిమంది మృత్యువాతపడ్డారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్పు సాధించిన ఆనందంలో అభిమానులు భారీగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ భారీగా తొక్కిసలాట జరిగింది. చిన్నస్వామి స్టేడియం లోపలికి అభిమానులు తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను

-మిగతా 2 లో



## పాలన చేతకాని
# కాంగ్రెస్ పార్టీ




- వేములవాడ కోడెల మృతి దారుణం
- ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఫుడ్ పాయిజనింగ్
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**తెలంగాణవీణ సిద్ధిపేట**

కాంగ్రెస్ పార్టీకి పాలన చేతగావడం లేదని ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. వేములవాడలో కోడెల మృతి, ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో జరిగిన ఫుడ్ పాయిజన్ ఘటనలపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేయడం చేతకావడం లేదని వ్యాఖ్యానించారు. ఎర్రగడ్డ మానసిక రోగులకు తగిన ఆహారం కూడా అందడం లేదని 70 మంది ఆస్వస్థతకు గురయ్యారని, ఈ విషయంపై ఇప్పటివరకు సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదని

-మిగతా 2 లో




## టెట్ 2025 పరీక్షల
# షెడ్యూల్ విడుదల

- 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్

**తెలంగాణవీణ హైదరాబాద్**

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ 2025 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. జూన్ 18 నుంచి 30 వరకు ఎగ్జామ్స్ జరగనున్నాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ) పద్ధతిలో ఈ పరీక్షలను నిర్వహిస్తారు. రోజూ రెండు సెషన్లలో ఉ.9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జూన్ 9 నుంచి హాల్ టికెట్లు-డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ తెలిపింది. ఈసారి -టె-ట్‌కు 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తి ఎగ్జామ్ షెడ్యూల్ కోసం టెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



## నాలుగు సంవత్సరాల్లో
# 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

- మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇళ్ల నిర్మాణం
- లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసిన పొంగులేటి

**తెలంగాణవీణ ఖమ్మం**

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల సత్యనారాయణపురంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ

-మిగతా 2 లో

# జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..


- ఆపరేషన్ సిందూర్‌పై చర్చ
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీలు డిమాండ్
- జులై 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు సమావేశాలు



**తెలంగాణవీణన్యూఢిల్లీ,**

పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.

-మిగతా 3 లో



# రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..

- రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..
- కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారు
- ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

**తెలంగాణవీణ హైదరాబాద్**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని.. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ గారు చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో

-మిగతా 2 లో

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం
# మా బాధ్యత

- క్యాబినెట్ సమావేశంలో నివేదిక సమర్పిస్తాం, పరిష్కారం కనుగొంటాం
- ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**తెలంగాణవీణ హైదరాబాద్,**

ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా ప్రభుత్వం బాధ్యత, సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్

-మిగతా 2 లో

## 2027 మార్చి 1 నుంచి
# జనాభా లెక్కల సేకరణ

- అప్పుడే కులగణన కూడా జరిగే అవకాశం
- కేంద్ర అధికార వర్గాల వెల్లడి



**తెలంగాణవీణ న్యూఢిల్లీ**

దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెరపడనుంది. జనగణనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం సన్నద్ధమవుతోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కులగణన

-మిగతా 2 లో

# ఆర్సీబీ విజయోత్సాహంలో ఘోర విషాదం

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు నియంత్రించలేకపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పది మంది మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. వారిని వివిధ అస్పత్రులకు తరలించారు. అభిమానులను నియంత్రించేందు కు చిన్నస్వామి స్టేడియం దగ్గర పోలీసులు లాఠీఛార్జ్ ప్రారంభించారు. స్టేడియం ఖాళీ చేయాలని అభిమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటు-న్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

# జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

(మొదటి పేజీ తరువాయి)

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఈ సమావేశాల్లో పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై చర్చించనున్నట్లు తెలిసింది. అంతేకాదు 23 రోజుల పాటూ జరిగే ఈ సమావేశాల్లో కీలకమైన బిల్లులను కూడా కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. జాతీయ భద్రత, ఆర్థిక స్థితిగతులపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ప్రధానికి ఎంపీల లేఖ..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్ వైమానిక స్థావరాలను తుత్తునియలు చేసింది. మన ఆర్మీ విజయం ముంగిట ఉందనగా.. కేంద్రంలోని మోదీ సర్కారు కాల్పుల విరమణకు అంగీకరించింది. దీంతో ఈ వ్యవహారంపై యావత్తు జాతి జనుల్లో ఎన్నో ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. దీనిపై ప్రధాని మోదీ సహా ప్రభుత్వ పెద్దలు ఎవ్వరూ నోరుమెదపడం లేదు. దీంతో పహల్గాం ఉగ్రదాడి ఘటన, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్షానికి చెందిన 16 పార్టీల ప్రతినిధులు ప్రధాని నరేంద్రమోదీకి మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖపై లోక్‌సభకు చెందిన 200 మందికి పైగా విపక్ష ఎంపీలు సంతకాలు చేశారు.

## వేటిపై చర్చకు పట్టుబట్టారంటే?

పహల్గాం ఉగ్రదాడి, ఆ తర్వాత చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన విషయాలపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించాలని విపక్ష పార్టీల నేతలు మంగళవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై కూడా ఈ సందర్భంగా చర్చించాలని పట్టుబట్టారు. సరిహద్దు గ్రామాల్లో పాక్ రేంజర్లు జరిపిన షెల్లింగ్‌లో ప్రాణాలు విడిచిన పౌరుల గురించి కూడా చర్చించాలని గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తదనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయంలో తమ ప్రతిపక్ష పార్టీలన్నీ ప్రభుత్వానికి మద్దతునిచ్చాయన్న విపక్ష నేతలు.. తమ డిమాండ్ మేరకు కేంద్రం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

అంబేద్కర్ సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై మీ అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల కమిటీకి సూచించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించారు. మీ వద్ద స్వీకరించిన సమాచారాన్ని కమిటీకి పలు దఫాలుగా వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేకపోయాం, ఇక ఎక్కువ కాలం పెండింగ్లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలనదే ప్రభుత్వ ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాలకు వివరించారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో అధికారుల నివేదికతో పాటు నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములు గా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నిటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని డిప్యూటీ సీఎం వివరించారు. ఒకవైపు ప్రజలకు మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశమైనట్టు డిప్యూటీ సీఎం తెలిపారు.

గత పది సంవత్సరాల పాలనతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి అయినప్పటికీ ఉద్యోగులకు సాధ్యమైనంత మేరకు మేలు చేయాలి, వారి సమస్యలు పరిష్కరించాలన్న ఆలోచనలో భాగంగానే మా ప్రభుత్వం రాగానే మొదటి తారీకు నే జీతాలు చెల్లిస్తుందని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, కొత్త పథకాలు పెద్ద సంఖ్యలో తీసుకువచ్చాం, విజయవంతంగా అమలు చేస్తున్నాం వీటికి తోడు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలన్న తపనలో ప్రజా ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

వనరులు సమకూర్చుకొని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకు పోతున్నాం అదే నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నాం ఈ కసరత్తు విజయవంతం కావాలని మనసున్న ప్రభుత్వం కోరుకుంటుందని వివరించారు. ఉద్యోగులకు మంచి చేయాలన్న ఆలోచనతోనే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని వివరించారు.

ప్రభుత్వ ఆదాయానికి మరియు ఖర్చుకు చేయాల్సిన పనులను బేరీజు వేసుకొని ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి బలంగా ఉన్నారని డిప్యూటీ సీఎం ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. ఉద్యోగుల కుటుంబాల్లో పెళ్లిళ్లు, ఆసుపత్రుల ఖర్చులకు సంబంధించిన సమస్యలపై క్యాబినెట్ సహచరులం అంతర్గతంగా పలుమార్లు చర్చించుకున్నామని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న అంశంపై ఎవరికీ భిన్నాభిప్రాయం లేదని తెలిపారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో ఉద్యోగ సంఘాల సమస్యలపై ఏర్పాటు చేసిన అధికారుల త్రీ మెన్ కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి క్యాబినెట్ కు నివేదిస్తాం, పరిష్కారం కనుగొంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఉద్యోగ సంఘాల నేతలకు వివరించారు. సమావేశం లో అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణభాస్కర్, సందీప్ కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కారుపై కవిత ఫైర్..

(మొదటి పేజీ తరువాయి)

నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జ్ ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి - పెన్నా అనుసంధానం పేరిట నీళ్లు తరలింపును తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు.

# పాలన చేతగాని కాంగ్రెస్ పార్టీ

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. వేములవాడలో కోడెల మరణం కొనసాగుతుండగా ప్రభుత్వం స్తంభించినట్లే ఉంది అని వ్యాఖ్యలు చేశారు. అనేక కోడెలు గడ్డి లేక చనిపోతున్నా, ప్రభుత్వం పట్టింపు తీసుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాకు బాధ్యత అప్పగిస్తే కోడెలను కాపాడుతాం అని స్పష్టత ఇచ్చారు. ఈ మధ్యే మాపై కేసులు పెట్టడం, కమిషన్లు ఏర్పాటు- చేయడం తప్ప అసలు సమస్యలపై ప్రభుత్వాన్ని పట్టించుకోడం లేదని, నిజమైన ప్రజా సమస్యలను వదిలి మిగతా విషయాల్లో బిజీ అయ్యారని తెలిపారు. ఇక కేబినెట్ సమావేశంలో రైతు బంధు డబ్బులను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తీవ్రంగా పిలుపునిచ్చారు.

# నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఆడబిడ్డ, తమ్ముడి కళ్లల్లో ఆనందాన్ని చూస్తుంటే భావోద్వేగానికి లోనవుతున్నామని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటు-ందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. పది సంవత్సరాల్లో మాజీ సీఎం కేసీఆర్‌కి రేషన్ కార్డులు కూడా ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 19 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డులో జమచేశామని ప్రకటించారు. ధనిక తెలంగాణ రాష్ట్రాన్నిగత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పుల్లోకి నెట్టారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో రూ.8 లక్షల 19 వేల కోట్ల అప్పు చేసి పోతే.. ప్రతి నెల రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా పేదోళ్ల గురించి మొసలి కన్నీరుని ఇందిరమ్మ ప్రభుత్వం కార్చబోదని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన చేసే కబుర్లు చెపితే ప్రజలు నమ్మరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఆయన కుటు-ంబ సభ్యులు కట్టు-కున్న ప్యాలెస్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇంటి మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెడితే రాజకీయంగా ఏం లాభం వస్తోందనే ఆలోచించారని అన్నారు. పేదవారికి ఖర్చు ప్రతి రూపాయి వారికి అందుతుందా లేదా అని కూడా కేసీఆర్ కనీసం ఆలోచించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

## 2027 మార్చి 1 నుంచి
# జనాభా లెక్కల సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

కూడా నిర్వహించనున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు- కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు. సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ పక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు- తెలుస్తోంది.

# పాక్‌కు సమాచారం చేరవత

**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**

దేశ భద్రతకు సంబంధించిన సున్నిత సమాచారాన్ని పాకిస్థాన్‌కు చేరవేస్తున్నాడనే ఆరోపణతో జస్బీర్ సింగ్ అనే యూట్యూబర్‌ని పంజాబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'జాన్ మహల్' అనే పేరుతో జస్బీర్ యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నాడు. ఆ ఛానల్‌కి 1.1 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. అయితే నిందితుడికి పాకిస్థాన్ ఇంటెలిజన్స్ అధికారి, ఐఎస్ఐకు పని చేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షకీర్ అలియాస్ జుట్ రాంధావాతో సంబంధాలు ఉన్నట్లు- తెలిసింది. పాక్ రాయబార కార్యాలయ అధికారి ఎహసాన్ ఉర్ రహీం అలియాస్ డానిష్‌తో కూడా ఇతనికి పరిచయం ఉంది. అంతేకాక.. ఇటీవల గూఢచర్యం కేసులో అరెస్ట్ అయినా హరియానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో కూడా ఇతనికి దగ్గర సంబంధాలు ఉన్నట్లు- తేలింది. డానిష్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలో జరిగిన జాతీయ దినోత్సవానికి కూడా జస్బీర్ హాజరైనట్లు- పోలీసులు తెలిపారు. అంతేకాక నిందితుడు 2020, 21, 24లో పాకిస్థాన్‌లో పర్యటించాడని పేర్కొన్నారు. నిందితుడి నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు- తెలిపారు. వాటిని ఫోరెన్సిక్ లాబ్‌కు తరలించగా.. శతృదేశానికి చెందిన అనేక నెంబర్లు బయటపడ్డాయని తెలిపారు. జ్యోతి అరెస్టు నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడనే ఆరోపణలు ఉన్నాయని.. దీనిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్ఠిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811



## ఢిల్లీలో కుప్పకూలిన భవనం.. శిథిలాల కింద ఐదుగురు..!



**తెలంగాణవీణ ఢిల్లీ**
దేశ రాజధాని ఢిల్లీలో ఓ వాణిజ్య భవనం కుప్పకూలింది. భవన శిథిలాల కింద నలుగురైదుగురు చిక్కుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఢిల్లీలోని రోహిణి ఏరియాలోగల సెక్టార్ 7లో బుధవారం సాయంత్రం 4.15 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకున్నాయి.స్థానిక పోలీసులు, అధికార యంత్రాంగంతో కలిసి రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగించి బాధితులను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. భవనం కూలినట్లు తమకు సాయంత్రం 4.15 గంటలకు సమాచారం వచ్చిందని, ఆ వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టామని ఢిల్లీ ఫైర్ డిపార్టుమెంట్‌కు చెందిన అసిస్టెంట్ డివిజినల్ ఆఫీసర్ ఆర్కే సిన్హా చెప్పారు.

## భారత్ ఓ అద్భుతమైన ప్రదేశం..

### అయోధ్యను సందర్శించిన ఎలాన్ మస్క్ తండ్రి..



**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**
ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరానికి వెళ్లారు. అక్కడ నూతనంగా నిర్మించిన అయోధ్య రామ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. భారతదేశం ఓ అద్భుతమైన ప్రదేశం అని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలు ప్రేమ, దయ కలిగిన వ్యక్తులు అని అన్నారు.కాగా, దక్షిణాఫ్రికాకు చెందిన ఎరోల్ మస్క్.. తన స్కూల్ ఫ్రెండ్ అయిన మాయే మస్క్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత కొన్నేళ్లకే వీరు విడాకులు తీసుకున్నారు. మాయే మస్క్ తన ముగ్గురు పిల్లల్ని ఒంటరిగానే పెంచింది. సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. ఇక ఎలాన్ మస్క్‌కు తన తండ్రి ఎరోల్ మస్క్‌తో విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. తండ్రంటే మస్క్‌కు అస్సలు ఇష్టం ఉండదు. 'మా నాన్న దుర్మార్గానికి ప్రతిరూపం. ఒక మనిషి ఎంత దారుణానికి ఒడిగట్టగలడో, అంతా తను చేయగలడు' అని ఓ సందర్భంలో స్వయంగా మస్క్ భారంగా వెల్లడించాడు.

## డొనాల్డ్ ట్రంప్ మనవరాలి కోసమే ఆ పని చేశా..

### పోలీసుల విచారణలో యువకుడి వెల్లడి



**తెలంగాణవీణ న్యూయార్క్**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నివాసమైన 'మార్ ఎ లాగో ' గోడ దూకేందుకు యత్నించిన యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా.. అతడు వారిని షాక్ గురిచేసే సమాధానం చెప్పాడు. తాను డొనాల్డ్ ట్రంప్ మనవరాలు కై ట్రంప్ ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని, అందుకే గోడ దూకే ప్రయత్నం చేశానని తెలిపాడు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంథోనీ థామస్ అనే 23 ఏళ్ల వ్యక్తి మంగళవారం ట్రంప్ ఇంటి గోడ దూకేందుకు యత్నించాడు. అది గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎందుకు గోడ దూకే ప్రయత్నం చేశావని వారు ప్రశ్నించగా.. అతడు షాకింగ్ సమాధానం ఇచ్చాడు. తాను ట్రంప్‌నకు ఒక శుభవార్త చెప్పడానికి వెళ్లానని, ఆయన మనవరాలు కై ట్రంప్‌ను పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నానని థామస్ తెలిపాడు. కాగా థామస్ ట్రంప్ ఇంటి గోడ దూకడం ఇది రెండోసారని అధికారుల విచారణలో తేలింది. గత ఏడాది డిసెంబర్‌లోనూ ఇలాంటి ఘటనే చోటుచేసుకున్నట్లు ఆయన తెలిపారు. థామస్ రెండోసారి తన ఇంటి గోడ దూకే ప్రయత్నం చేసినప్పుడు డొనాల్డ్ ట్రంప్ వాషింగ్టన్‌లో ఉన్నారని, దీనిపై ఆయనకు సమాచారం అందించామని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం థామస్‌ను పామ్‌బీచ్‌లోని జైలుకి తరలించారు. కాగా 'మార్ ఎ లాగో' అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంటుంది. ఇక్కడికి సందర్శకులను, అతిథులను ఎవ్వరినీ అనుమతించరు. గతంలో ట్రంప్‌పై హత్యాయత్న ప్రయత్నాలు జరిగిన నేపథ్యంలో అధికారులు భద్రతను భారీగా పెంచారు. ఇంత కట్టుదిట్టమైన భద్రత ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం.

# చైనా ప్రమాదకర ఫంగస్ స్మగ్లింగ్..

### -అమెరికాలో ఇద్దరు చైనా శాస్త్రవేత్తలు అరెస్టు



**తెలంగాణవీణ న్యూయార్క్**
ప్రమాదకరమైన బయోలాజికల్ ప్యాథోజన్ ను స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు చైనీయులను అమెరికా అరెస్టు చేసింది. పరిశోధన కోసం ఆ ప్యాథోజన్ స్మగ్లింగ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ ఉగ్రవాద ఆయుధంగా ఆ బయోలాజికల్ ప్యాథోజన్‌ను వాడేందుకు ప్రయత్నాలు జరిగినట్లు అమెరికా ఆరోపించింది. వ్యాధికారక ఆ ఫంగస్ శాస్త్రీయ నామం ఫుసేరియం గ్రామినేరియం. శాస్త్రీయ పరంగా దీన్ని అగ్రో టెర్రరిజం వెపన్‌గా వినియోగిస్తారని అమెరికా న్యాయ శాఖ చెప్పింది. వివిధ రకాల పంటలు ఆ ఫంగస్ సోకితే చనిపోతాయి. దీంతో భారీ స్థాయిలో ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. దీని వల్ల బిలియన్లలో నష్టం జరిగే అవకాశాలు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ పేర్కొన్నది.ఫుసేరియం గ్రామినేరరియం వల్ల పంటలకు నష్టమే కాదు.. ఆ ఆహారం తిన్న మనుషులకు రకరకాల వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయి. వాంతులు, లివర్ డ్యామేజ్ కావొచ్చు. మనుషులతో పాటు జంతువుల్లో.. ప్రత్యుత్పత్తి సమస్యలు కలిగే అవకాశాలు ఉన్నాయి. బయోలాజికల్ ఫంగస్ వెపన్‌ను స్మగ్లింగ్ చేసిన కేసులో 33 ఏళ్ల యున్కింగ్ జియాన్, 34 ఏళ్ల జుయాంగ్ లియూలను అరెస్టు చేశారు. వారిపై కుట్ర, స్మగ్లింగ్ కేసు నమోదు చేశారు. తప్పుడు ప్రకటనలు చేశారని, వీసా ఫ్రాడ్ కేసు కూడా వాళ్లపై బుక్ చేసినట్లు మిచిగన్ జిల్లా జడ్జి పేర్కొన్నారు. ఫంగస్ స్మగ్లింగ్‌పై ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసింది. డెట్రాయిట్ ఎయిర్‌పోర్టు ద్వారా ఆ స్మగ్లింగ్ చేశారు. మిచిగన్ యూనివర్సిటీ ల్యాబ్‌లో పరీక్షల కోసం ఆ రూట్లో స్మగ్లింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఆ ల్యాబ్‌లో లియూ గర్ల్‌ఫ్రెండ్ జియాన్ గతంలో పనిచేసింది. ఫుసేరియం గ్రామినేరియం ఫంగస్ వల్ల గోధుమ, బార్లీ, మొక్కజొన్న, వరి పంటలకు వ్యాధులు సోకే అవకాశం ఉంటుంది. గతంలో జియాన్‌కు చైనీస్ ప్రభుత్వం ఫండింగ్ ఇచ్చింది. చైనాలో ఇదే వ్యాధికారక ప్యాథోజన్‌పై పరీక్షలు చేపట్టిందామె. చైనీస్ కమ్యూనిస్టు పార్టీతో ఆమెకు సంబంధాలు ఉన్నట్లు కూడా తెలుస్తోంది. ఆ జంట ప్రవర్తించిన తీరు ప్రజల భద్రతకు ముప్పుగా ఉన్నట్లు ఎఫ్‌బీఐ డెట్రాయిల్ ఫీల్డ్ ఆఫీసు ఇంచార్జ్ చెవోరియా గిబ్సన్ తెలిపారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ కూడా దీనిపై స్పందించారు. అమెరికా సంస్థలపై చైనా తన పరిశోధకుల్ని పంపిస్తున్నదని ఆరోపించారు. అమెరికాలో ఆహార సరఫరా వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నం చైనా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎఫ్‌బీఐతో పాటు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఈ కేసులో సంయుక్త విచారణ చేపడుతున్నాయి.

# తొక్కిసలాటపై ప్రధాని దిగ్భ్రాంతి..

### మృతులకు 2 లక్షల ఎక్స్‌గ్రేషియా



**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**
చిన్నస్వామి స్టేడియం తొక్కిసలాటపై ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన ఆయన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతేకాదు ఆత్మీయులను కోల్పోయిన ఫ్యామిలీస్‌కు కేంద్ర తరఫున రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వాళ్లకు రూ. 50 వేల పరిహారం చెల్లిస్తామని మోడీ వెల్లడించారు.కర్నాటక ప్రభుత్వం కూడా తొక్కిసలాట మృతులకు నష్టపరిహారం ప్రకటించింది. ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేసిన కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బౌరింగ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వాళ్లను పరామర్శించారు. ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో మృతి చెందిన వాళ్ల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు.
చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయారు. 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఊహించని రీతిలో అభిమానులు తరలి రావడంతో ఈ దురదృష్టకరమైన ఘటన జరిగింది. దాదాపు 3 లక్షల మంది జనం రావడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల నష్టపరిహారం చెల్లిస్తాం. గాయపడినవాళ్లకు మెరుగైన వైద్య చికిత్స అందిస్తాం' అని సిద్ధరామయ్య తెలిపారు. అంతేకాదు తొక్కిసలాటపై న్యాయ విచారణకు ఆయన ఆదేశించారు.

**భారీకేడ్లను తోసుకుంటూ..**
చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. సరైన భద్రతా ఏర్పాట్లు చేయడంలో కర్నాటక సర్కార్ విఫలమైంది. భారీగా తరలివచ్చిన అభిమానులను నియంత్రించలేకపోయారు పోలీసులు. ఒక్కసారిగా స్టేడియం గేట్లు తెరవడంతో భారీకేడ్లను తోసుకుంటూ మరీ స్టేడియంలోకి దూసుకొచ్చారు ఫ్యాన్స్. అంతే.. వాళ్లను కంట్రోల్ చేసేందుకు లాఠీ ఛార్జ్ చేసినా అప్పటికే నష్టం జరిగిపోయింది.

# కూలిన 9 పాకిస్థానీ యుద్ధ విమానాలు

**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**
ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఓ రిపోర్టు ప్రకారం ఆ దేశ వైమానిక దళానికి చెందిన ఆరు యుద్ధ విమానాలు నేలకూలాయి. దీంతో పాటు రెండు హై వాల్యూ సర్వియలెన్స్ ఎయిర్‌క్రాఫ్ట్, పది ఆర్మ్ డ్రోన్లు, ఒకటి సీ-130 హెరిక్యూల్స్ ట్రాన్స్‌పోర్టు విమానం ధ్వంసమైనట్లు తెలుస్తోంది. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్ వైమానిక, సైనిక దళానికి భారీగా నష్టం జరిగినట్లు అంచనా వేశారు. పాకిస్థాన్‌లోని పంజాబ్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో జరిగిన వైమానిక దాడుల్లో పాకిస్థాన్ వైమానికి దళానికి చెందిన విమానాలు నేలకూలినట్లు రిపోర్టు ద్వారా తెలుస్తోంది.రేడార్ ట్రాకింగ్, థర్మల్ సిగ్నేచర్ ద్వారా పాక్ విమానాలు కూలిన విషయాన్ని కన్ఫర్మ్ చేసినట్లు రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. భారతీయ మిస్సైల్ వ్యవస్థలు ఆ సిగ్నల్స్ అందుకున్నట్లు తెలుస్తోంది. పేల్చివేత తర్వాత పాక్ విమానాలకు చెందిన ట్రాకింగ్ సమాచారం లభ్యంకావడంలేదన్నారు. నాలుగు రోజులు జరిగిన సమరంలో.. హై వాల్యూ నిఘా ఎయిర్‌క్రాఫ్ట్ కూల్చివేత కీలకమైందని పేర్కొన్నారు. 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆ వ్యవస్థను లాంగ్ రేంజ్ మిస్సైల్ సుదర్శన్‌తో చిత్తు చేసినట్లు చెప్పారు. స్వీడన్ దేశానికి చెందిన ఎయిర్‌బార్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ ను కూల్చినట్లు రిపోర్టు ద్వారా




తెలుస్తోంది. పాకిస్థాన్‌లోని బోలారి ఎయిర్‌బేస్‌లో ఆ సిస్టమ్ ఉన్నది. ఎయిర్ టు సర్ఫేస్ క్రూయిజ్ మిస్సైల్ దాడి ద్వారా దాన్ని నాశనం చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్ హౌజింగ్ ధ్వంసానికి చెందిన శాటిలైట్ చిత్రాలను రిలీజ్ చేశారు. మరో ఆపరేషన్‌లో సీ-130 హెర్క్యూల్స్ విమానాన్ని కూల్చేశారు. పాకిస్తానీ పంజాబ్‌పై జరిగిన డ్రోన్ దాడిలో ఆ విమానం కూలింది. సీ-130ని లాజిస్టికల్ సపోర్టు కోసం వినియోగిస్తారు. ముల్తాన్ వద్ద ఆపరేట్ చేస్తున్న దాన్ని డ్రోన్ దాడితో కూల్చేశారు. రఫేల్, సుఖోయ్ 30 ద్వారా చైనాకు చెందిన వింగ్ లూంగ్ సిరీస్ డ్రోన్లను నేలకూల్చారు. సింగిల్ స్ట్రయిక్‌లో యూసీఏవీలను పేల్చినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సింధూర్‌కు కౌంటర్‌గా ఆపరేషన్ బుయాన్ ఉన్ మార్సూస్‌ను పాకిస్థాన్ నిర్వహించింది. అయితే భారత్ అంచనా వేసిన దాని కన్నా అదనంగా మరో ఏడు ప్రాంతాల్లో పాక్‌కు నష్టం జరిగినట్లు ఆపరేషన్ బుయాన్ రిపోర్టు ద్వారా స్పష్టమైంది. పెషావర్, జాంగ్, హైదరాబాద్(సింధ్), గుజరాత్, బహావల్‌నగర్, అటోక్,చోర్ ప్రాంతానలు కూడా ఇండియా టార్గెట్ చేసినట్లు రిపోర్టు ద్వారా వెల్లడైంది.

# ఆసుపత్రుల్లో పారదర్శకత, మర్యాదతో సేవలందించాలి

## కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**తెలంగాణవీణ కరీంనగర్,**
మంథని ఆసుపత్రి పనితీరుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదతో వ్యవహరించాలన్నా, పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు తీసుకోవాలన్నా ఆయన స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాతా శిశు ఆసుపత్రుల్లో పారిశుధ్య స్థాయి ఆశించినంతగా లేదని కలెక్టర్ తెలిపారు. తక్షణం మెరుగులు తీసేలా చూడాలని, లేకపోతే పారిశుధ్య కాంట్రాక్టర్‌కి చెల్లింపులు నిలిపివేయబడతాయని హెచ్చరించారు. రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆసుపత్రి సిబ్బంది తీరును పరిశీలించాలని, పనితీరులో మార్పు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి నేపథ్యంలో హాజరు పర్యవేక్షణకూ ప్రాముఖ్యత ఇవ్వాలని, వైద్య సిబ్బంది హాజరును బయోమెట్రిక్ ద్వారా నిర్ధారించే విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. రోజూ హాజరు నివేదిక సమర్పించాలని, ఆసుపత్రుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. మంథని పట్టణంలో రూ.26 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, పెద్దపల్లి పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో వర్షాకాలానికి ముందే ఒక బ్లాక్ సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమీక్షలో డీసీహెచ్ఓ శ్రీధర్‌తో పాటు ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# భూభారతితో దరణి కష్టాలు మటుమాయం





**తెలంగాణవీణ పోరండ్ల,**
పోరండ్ల రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ధరణి వల్ల రైతులు ఎదుర్కొంటున్న భూ సంబంధ సమస్యలు భూ భారతి చట్టంతో సమసిపోతాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెచ్చిన ధరణి వల్ల రైతులు పడిను కష్టాలు ఇన్నీ,అన్నీ కావన్నారు. ధరణి లోని లొసుగులను అవకాశంగా చేసుకొని గ్రామాల్లో కొందరు ఆక్రమణలకు తెగబడ్డారని, కాగా మరికొందరు అక్రమ బదలాయింపులకు పాల్పడ్డారన్నారు. దీంతో గ్రామాల్లో భూవివాదాలు పెచ్చుమీరిపోయాయని, హత్యలకు దారితీసిన సంఘటలు కూడా చోటుచేసుకున్నాయన్నారు. దరణిలోని లోపాల కారణంగా రైతులు,భూ యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన భూభారతి చట్టంతో రైతుల చిక్కులు తీరుతాయన్నారు. పదేళ్లుగా ఎదుర్కొంటున్న భూసమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకు వచ్చిందని ఆయన వివరించారు.రైతులకు భూభారతి వరం లాంటిదని ఆయన పేర్కొన్నారు. రైతులకు సర్వరోగ నివారణిగా భూభారతి పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎవరికైనా భూసంబంధ సమస్యలు ఉంటే ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సదస్సులో తిమ్మాపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఉప తహసీల్దార్ రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి, పోలు రాము, పోలు రమేశ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారమే సర్కార్ ధ్యేయం



**తెలంగాణవీణ మానకొండూర్,**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి
సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మానకొండూర్ శాసనసభ్యుడు డాకట్ర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం గన్నేరువరం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. ఈ పథకం కింద విడతల వారీగా అర్హులైన నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగ జరుగుతుందని, ఇందులో అవకతవకలకు, అవినీతికి తావులేదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గూడులేని పేదలకు ఇళ్లు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని ఆయన వివరించారు. నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేయడమే ఈ పథకం ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల తహసీల్దార్ శ్రీనివాస్, ప్రత్యేకాధికారి రామానుజాచారి,పీడీ గంగాధర్, గృహనిర్మాణ సంస్థ ఏఈ మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, పార్టీ నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమెర రవీందర్ రెడ్డి, మాతంగి అనిల్, మార్గం మల్లేశం, చంద్రారెడ్డి తోపాటు వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**పార్వెల్లలో రెవెన్యూ సదస్సు**
గన్నేరువరం మండలం పార్వెల్ల గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరిట బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.

# కొత్తగా మరో 276 మందికి కరోనా పాజిటివ్..

## 44కి పెరిగిన మృతుల సంఖ్య

**తెలంగాణవీణ న్యూఢిల్లీ,**
దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. కొత్తగా దాదాపు 300 మందికి పాజిటివ్‌గా తేలింది. దీంతో దేశంలో కరోనా వైరస్ యాక్టివ్ కేసుల సంఖ్య 4,300 దాటింది.కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం.. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకూ 276 కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో ఇప్పటి వరకూ కొవిడ్ బారిన పడిన వారి సంఖ్య 4,302కి పెరిగింది. అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 1,373 కేసులు పాజిటివ్‌గా ఉన్నాయి. ఆ తర్వాత మహారాష్ట్రలో 510, గుజరాత్‌లో 461, ఢిల్లీలో 457, పశ్చిమ బెంగాల్‌లో 432, కర్ణాటకలో 324, తమిళనాడులో 216, ఉత్తర ప్రదేశ్‌లో 201 కేసులు పాజిటివ్‌గా ఉన్నాయి. గత 24 గంటల్లో ఏడు మరణాలు సంభవించాయి. మహారాష్ట్రలో నాలుగు, ఢిల్లీ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు చొప్పున కొవిడ్ తో మరణించారు.

# సంపాదకీయం

## మరోమారు కోరలు చాస్తోన్న కరోనా

ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్... మళ్లీ మెల్లగా విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా కరోనా కేసులు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికే దేశంలో నాలుగువేల కేసులు నమోదైనట్లు సమచారం. అలాగే మరణాలుకూడా నమోదవుతున్నాయి. ఇది అంత డేంజర్ కాదంటున్నా తీవ్రతను తక్కువ చేయడా నికి లేదు. అలాగే తెలుగు రాష్ట్రాల్లోనూ కరోనా కలకలం మొదలైంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో అత్యధికంగా ఎన్‌బి.1.8.1, ఎల్ఎఫ్.7 వేరియంట్లు వున్నట్లు నిపుణులు గుర్తించారు. అయితే, గతంలో మాదిరిగా ఆక్సిజన్ లెవల్స్ పడిపోవడం, ఆయాసం, నీరసించిపోవడం వంటి లక్షణాలు ఇప్పుడు లేవు. ఈ వేరియంట్లు- అంత ప్రమాదకరమైనవి కావని, అయినప్పటికీ... అప్రమత్తంగా వుండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, కొత్తగా వచ్చే ఈ కరోనా తీవ్రమైనదో, సాధారణమైనదో... ఇప్పుడే చెప్పలేము. ముమ్ముందు దీని తీవ్రత తెలియనుంది.పేదరికం, వాతావరణ కాలుష్యం వంటి అనేక రుగ్మతలు మానవాళిని చుట్టుముట్టి, ఊపిరి సలపనివ్వని విపత్కర పరిస్థితిలో 'మళ్లీ కరోనా' మహమ్మారి కోరలు చాస్తోంది. సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినా కరోనా మానవాళిని వణికించింది. ఇది మన సామాజిక, ఆర్థిక వ్యవస్థలను, వైద్య రంగాన్ని సవాల్ చేసిందంటే అతిశయోక్తి కాదు. కరోనా మళ్లీ వచ్చిందని ఆందోళన పడేకంటే, గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలతో పాటు, అప్రమత్తత, జాగ్రత్త, పరిశుభ్రత అనే ఆయుధాలతో దీన్ని ఎదుర్కోవాలి. పరిశుభ్రత, పరిసరలాల శుభ్రత వంటివి ప్రధాన ఆయుధంగా గుర్తించాలి. గత కోవిడ్ సమయంలో వ్యాక్సిన్‌ల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వున్నాయని ఆస్ట్రాజెనెకాయే ఒప్పుకోవడంతో, కోవిషీల్డ్ వ్యాక్సిన్ వేయించుకున్న వారు కేసులు వేసిన సంగతి తెలిసిందే. ఫార్మా కంపెనీలు, ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజాధనం దోచేశారనే వార్తలూ వచ్చాయి. ఈ క్రమంలో మళ్లీ కరోనా విజృంభిస్తోందన్న వార్తలు ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు వేవ్‌లలో సాగిన మహోత్పాతం పీడకలగా వెంటాడు తున్న తరుణంలో... రోగ విస్తృతి, ప్రభావం, నివారణ వంటి విషయంలో ప్రభుత్వాలు ఎలాంటి దాపరికం లేకుండా ప్రజలకు భరోసా యివ్వాల్సి ఉంది. అలాగే ప్రజలను అప్రమత్తం చేయల్సిన అవసరం ఉంది. రెండు వేవ్‌ల నుంచి పొందిన గుణపాఠం.. ఒక అనుభవంగా తీసుకుని ప్రజలు మసులకుంటే మంచిది. మళ్లీ కరోనా వచ్చిందని భయపడేకంటే... అప్రమత్తంగా ఉండి ముందుకు సాగాలి. ఎందుకంటే వైరస్‌లు వస్తూ పోతుంటాయి. మనం జాగ్రత్తలు తీసుకుంటూ జీవత గమ్యాన్ని సాగించాల్సి ఉంది.ఒకానొక కాలంలో ప్రాణాంతకమైన వ్యాధిగా పరిగణింపబడి, ఎన్నో ప్రాణాలను బలితీసుకున్న కలరా నిర్మూలన జ్ఞాపకాలను తన మూలాల్లో నిలుపుకొని, సజీవ చిత్రంగా మన ముందు నిలిచిన చార్మినార్ లాగే, రెండు వేవ్‌లలోనూ ప్రాణాలను బలిగొన్న కరోనా జ్ఞాపకాలు ఇంకా మెదలుతూనే వున్నాయి. జీవితంలో ఎదురయ్యే ప్రతి విపత్తూ... మనం ఎలా స్పందించామనే దానిపైనే ఆధారపడి వుంటుంది. ప్రగతికి నూతన వారధి నిర్మిస్తూ, అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న మనిషి... కరోనాకు చరమగీతం పాడటంలోనూ అప్రమత్తుడేనని నిరూపించాల్సిన సమయం ఇది. కరోనా ప్రభావం ఎంతకాలం ఉంటుందన్న దానికి సమాధానం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ వ్యాప్తి మళ్లీ పెరగడం ఆందోళన కలిగింస్తోంది. కొత్త వేరియంట్ విజృంభణతో మళ్లీ ఆంక్షల దిశగా పయనిస్తామా అన్న ఆందోళన కలుగుతోంది. కరోనా తీవ్ర రూపం దాల్చి, మరోమారు ప్రపంచం స్తంభిస్తే ఉత్పత్తి పడిపోవడం, వస్తు వినియోగం పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా భారత్ లాంటి దేశాలు అతలా కుతలం అవుతాయ. ఇది కూడా మన ఆర్థిక వ్యవస్థకు భారంగానే చూడాలి. గత రెండు వేవ్‌లలో వ్యాపార, వాణిజ్యాలు మొత్తం దెబ్బతిన్నాయి. చిరు వ్యాపారులు ఆదాయం లేక చితికి పోయారు. ప్రజలు ఇళ్లకే పరిమితం కావడం ఇష్టం లేక ..గత్యంతరం లేక యధావిధిగా తమ జీవనాధారం కోసం పనుల్లో దిగక తప్పని పరిస్థితిని చూశాం. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు స్వారీ చేస్తున్నాయి. కరోనా ప్రభావం ఉపాధి, ఉద్యోగుల పనిగంటలు, వేతనాల కోతలకు దారితీయవచ్చని ఇప్పటికే అనుభవంలోకి వచ్చింది. కరోనా నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి ప్రవేశించిన సందర్భాన్ని చూశాం. సెకండ్ వేవ్ సృష్టించిన విపత్తును తలచుకుంటేనే జనం వణికి పోతున్నారు. ఆక్సిజన్ లేమి, వైద్య సదుపాయాల కొరత, అరకొర టీకాలు ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా చేశాయి. ప్రతిరోజూ లక్షల్లో పాజిటివ్ కేసులు, వేలల్లో మరణాలు జనాన్ని వణికించాయి. తాజా వేరియంట్ అంత ప్రమాదకారి కాదని ఒకవైపు..జాగ్రత్తగా ఉండాలని మరోవైపు వస్తున్న హెచ్చరికల మధ్య ప్రజల జీవితాలను భయాందోళనలోకి నెడుతోంది. కోవిడ్‌తో కుటుంబాలకు కుటుంబాలనే పోగొట్టుకున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. మూడవ ముప్పు పొంచి ఉందంటూ వెలువడుతున్న సంకేతాల నేపథ్యంలో తాజా కరోనా వ్యాప్తి ఆందోలన కలిగించేదే. పోషకాహారం విషయంలోనూ, ఆకలి సమస్యలోనూ మన దేశం ఎక్కడో అట్టడుగున ఉందని ప్రపంచ స్థాయి ర్యాంకింగ్ సంస్థలు కుండబద్దలు కొట్టాయి. కోట్లాది మంది ఆకలితో అలమటిస్తున్న వేళ వారిలో ఇమ్యూనిటీని ఆశించడం వంచనే అవుతుంది. వ్యాక్సిన్ రెండు డోసులూ తీసుకున్న వారిలో సైతం ఈ కొత్త రకం వైరస్‌ను నిరోధించే శక్తి ఎంత ఉంటుందనేది ప్రశ్నార్ధకమని నిపుణులు అంటున్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఎన్నికల హామీలేనా?


-రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలో తెలంగాణ ఉద్యమ అమరుల కుటుంబాలను విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.
-కోటి రూపాయల పురస్కారం అందుకొన్నవారు కూడ నోరు మెదక పోవడం, వారి నైతికతపై మాయనిమచ్చ.
-టియుజేఏసి ప్రతిపాదించిన ప్రజాస్వామికమైన డిమాండ్లను గుర్తించకపోవడం ద్వందనీతికి నిదర్శనం.
-ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి.



**తెలంగాణ వీణ,జవహర్ నగర్...** ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 12 వ అవతరణ దినోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ అమరుల త్యాగాలను, వారి కుటుంబాలను విస్మరించడాన్ని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలన్నికూడ, ఎన్నికల హామీలేనా? అని రాష్ట్ర ప్రభత్వాన్ని నిలదీశారు. గత బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులపట్ల అనుసరించిన విధానాన్నే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడ తమ ద్వందనీతిని అనుసరిస్తున్నది ఆరోపించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్న తెలంగాణ ఉద్యమకారులకు, వారి కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వెనుక ఉన్న నిర్లక్ష్యాన్ని, అవకాశవాద రాజకీయాలను తీవ్రంగా ఎండగట్టారు. తెలంగాణ ఉద్యమకారులు మరోసారి మోసపోయారని గుర్తుచేశారు. గత పదిసంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తమ అనునయులకు పెద్ద పీట వేసినట్లుగానే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడ తమ అనునయులకు మాత్రమే నగదు పురస్కారాలు, సంక్షమ ఫలాలను అందజేస్తున్నదని మండిపడ్డారు. గత కొన్ని నెలలుగా తొలి, మలి దశలో అన్నిరకాలుగా నష్టాలను చవిచూసిన ఉద్యమ కారుల త్యాగాలకు న్యాయమైన, ప్రజాస్వామికమైన గుర్తింపును కోరుకుంటున్నారని అన్నారు. అందులో బాగంగానే మంత్రులకు, అధికారులకు ఎన్నో విజ్ఞప్తి పత్రాలు, నిరసన దీక్షలు లాంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ ద్రుష్టికి తీసుకెళ్ళారని అన్నారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల వారితో చర్చలు, సమిక్షలు జరిపి, ఉద్యమ కారుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందు తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ పెట్టిన ప్రతిపాదనలు గుర్తింకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ వైఫల్యాలను ఎత్తిచూపి, అప్పటి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి తోపాటు, పార్టీ పెద్దలకు తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఉద్యమ కారుల పక్షాన నిలబడేటట్లు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమైన టియుజేఏసి, తెలంగాణ ప్రజలు, ఉద్యమ కారుల ప్రయోజనాల కొరకు జూన్-2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. వారి ఆశలను అడిఆశలు చేశారని అన్నారు. ఇది తెలంగాణ ఉద్యమకారులేనే గాక, అమరులను, వారి త్యాగాలను అవమానించడమేనని స్పష్టం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికి కాదు, కొందరకే అన్నట్లుగా పాలకులు వ్యవహారించడం దోపిడీ, అసమానతలను పెంచి పోషించడమే నని గుర్తుచేశారు. ఇలాంటి క్రమంలో కవులు, కళాకారుల పేరున ప్రకటించిన కోటి రూపాయల నగదు పురస్కారాలు అందుకున్న వారైన, కనీసం తెలంగాణ ఉద్యమకారుల పక్షాన సంక్షేమ బోర్డుకు డిమాండ్ చేయకపోవడం వారి నైతికతకు మాయనిమచ్చ అని గుర్తుచేశారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలస్తుందో? నిలవదో కానీ ముందుగా ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల గత ప్రభుత్వాన్ని గద్దె దింపినట్లుగానే, రాబోయే రోజుల్లో అలాంటి చేదు అనుభవాలను తెలంగాణ ఉద్యమకారులు, వారి కుటుంబాల నుండి చవిచూడవలసి ఉంటుందని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని షేక్ షావలి హెచ్చరించారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు అనుకూలంగా ప్రకటన రాబోతుందని, టియుజేఏసి నిర్వహిస్తున్న కార్యక్రమాలపై శోషల్ మీడియాలో బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ ఉద్యమ ఫోరం ఇప్పటికైన తమకున్న భ్రమలను వదులుకొని, టియుజేఏసితో కలిసి సంఘటితంగా తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల అమలుకు ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.


## ఘనంగా శ్రీ శ్రీ మధుర మీనాక్షి అమ్మవారి శ్రీ వీరభద్ర స్వామివారి బోనాలు పాల్గొన్నా కోలన్ హన్మంత్ రెడ్డి





**తెలంగాణ వీణ: కుత్బుల్లాపూర్** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 128 డివిజన్ రోడమేస్త్రి నగర్లోని శ్రీ శ్రీ మధుర మీనాక్షి అమ్మవారి మరియు శ్రీ వీరభద్ర స్వామివారి బోనాల మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖ:సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,సీనియర్ కాంగ్రెస్ యువజన నాయకులు పాల్గొన్నారు.

## వల్లూరు రెవెన్యూ సదస్సులో 60 అర్జీలు




**తెలంగాణ వీణ/ చేగుంట** మెదక్ జిల్లా, నార్సింగి మండలం, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తాసిల్దార్, నార్సింగి మండలం పరిధిలో ఉన్న వల్లూరు గ్రామంలో రెండవ రోజు బుధవారం నాడు గ్రామ పంచాయతీ వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులు రైతుల నుంచి వివిధ భూ సమస్యలకు సంబంధించిన 60 అర్జీలు వచ్చినట్లు తాసిల్దార్ కరీం తెలిపారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఇంద్రమ్మ కమిటీ అధ్యక్షులు వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మంతన్ గౌరెల్లి గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సు

**తెలంగాణ వీణ,యాచారం...** యాచారం మండలం మంతన్ గౌరెల్లి మంతన్ గౌడ్ సుల్తాన్ పూర్ పరిధిలో ఉన్న అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని గ్రామం చుట్టూ ఉన్న గ్రామ కంట భూమిని సర్వే చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలిపి అనంతరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి రామకృష్ణ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యవర్గ సభ్యులు చందు నాయక్ సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు మాజీ ఎంపిటిసి తావు నాయక్ మాట్లాడుతూ మంతన్ గౌరెల్లి మంతన్ గౌడ్ సుల్తాన్ పూర్ రెవెన్యూ పరిధిలోని అసైన్మెంట్ ఇనాం భూములకు నిరుపేద రైతులకు భూములను సాగు చేసుకుంటూ గత 50.60 సంవత్సరాల నుండి రికార్డు పరంగా ఉన్నారని అందరికీ ప్రొసీడింగ్ పట్టాదారు పాసుబుక్కులు అన్ని రికార్డు పరంగా ఉన్నాయి కానీ 2018 సంవత్సరంలో ధరణి పేరుతో కొత్త పట్టాదారు పాసు బుక్కులు



ఇవ్వకుండా నిలిపివేశారని విమర్శించారు ఆ భూములకు అనేక సార్లు మీ సేవలో ఆన్లైన్లో వేల రూపాయల లో కట్టుకున్న కలెక్టర్ కార్యాలయం నుంచి రిజెక్ట్ అయిందని తాసిల్దార్ కి కలెక్టర్ కు ఎన్నిసార్లు దరఖాస్తులు ఇచ్చిన ఫలితం లేదని విమర్శించారు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంలో ఇప్పుడైనా పట్టా పాస్ బుక్కులు బిఎస్ పెండింగ్ మిస్సింగ్ అసైన్మెంట్ భూములను అన్ని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు అలాగే మంతన్ గౌరెల్లి గ్రామంలో చాలా మంది నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అణగారిన వర్గాల ప్రజలు ఇండ్ల స్థలాలు లేక కుటుంబాలు ఒక ఇంట్లో మూడు నాలుగు కుటుంబాలు కాపురం చేస్తున్నారని అన్నారు కావున గ్రామంలో గ్రామ కంట భూమి సర్వే చేయించి ఆ భూమి నిరుపేద వాళ్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అన్నారు భూ సమస్యలు పరిష్కారం కానీ యే డల మరియు గ్రామ గంట భూమిని సర్వే చేయని యెడల ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున తాసిల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కందుల శ్రీరాములు పార్టీ నాయకులు బట్టు జంగయ్య భాస్కర్ పంతు నాయక్ గ్రామ ప్రజలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మెదక్ జిల్లా తపస్ మహిళా ప్రధాన కార్యదర్శి రేఖా సుజాత




**తెలంగాణ వీణ/చేగుంట** మెదక్ జిల్లా, చేగుంట మండల కేంద్రంలోని తపస్ కార్యాలయంలో మెదక్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి సుజాత మాట్లాడుతూ రేపటి మంత్రివర్గ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యల గురించి చర్చించాలని, తక్షణమే బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని, పెండింగ్ లో ఉన్న డి ఏ లను, జిపిఎఫ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పి ఆర్ సి ని ప్రకటించి అమలు చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సమ్మె కాలం వేతనం వెంటనే చెల్లించాలని, జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను బడిబాట తర్వాత నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ మహిళా నాయకులు స్వప్న శ్రీ, అర్చన, సంగీత, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం.

-శివగంగ దేవాలయ చైర్మన్ అల్లె కుమార్.

**తెలంగాణ వీణ,మహేశ్వరం...** కాంగ్రెస్ రాజ్యంలోనే పేదలకు న్యాయం చేకూరుతుందని శివగంగ దేవాలయ చైర్మన్ అల్లె కుమార్ అన్నారు. బుధవారం మహేశ్వరం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రోసిడింగ్ కాపీలను పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంగారు గల్ల లాజర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు స్వర్ణ గంటి సుభాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్షపతి తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుపరచడం జరుగుతుందని ఆయన అన్నారు. గత 10



సంవత్సరాలలో బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్కరికి ఇండ్లను కట్టించలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ల పేరుతో పేదలకు అరచేతిలో వైకుంఠాన్ని చూపించారని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ను కేటాయించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సంపన్న వర్గాలకు దీటుగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి పేదల కడుపులను నింపుతుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులు అధికారుల ఆదేశాల మేరకు గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, బిల్ కలెక్టర్ శేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవేందర్, సాయిలు, పుట్ల గారి చందు, తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపడుచు పెళ్లికి బియ్యం అందజేసిన పరంజ్యోతి

**తెలంగాణ వీణ/చేగుంట** మెదక్ జిల్లా, చేగుంట మండల కేంద్రానికి చెందిన సోమ కళావతి భూములు ల కూతురు తేజశ్రీ వివాహం కోసం తన వంతు సాయంగా ప్రముఖ



సంఘ సేవకులు, వాసవి క్లబ్ జోన్ చైర్మన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయిత పరంజ్యోతి 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో అయిత పరంజ్యోతి తో టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీశైలం శ్రీనివాస్,అమాలీ సంఘం.అధ్యక్షులు సోమ వెంకటేష్, మాజీ వార్డ్ మెంబర్ పొట్టి పోచయ్య , కట్ట శ్రీనివాస్,హమాలీ సంఘం అధ్యక్షులు సోమ వెంకటేష్, భూములుతదితరులు పాల్గొన్నారు

## చర్మ నిపుణుల సహకారంతో తయారు చేసిన ప్రొడక్ట్స్ చర్మానికి ప్రభావవంతంగా ఉంటాయి

**వినీత్ కపూర్...**



**తెలంగాణ వీణ,బషీర్ బాగ్...**

చర్మ నిపుణుల సహకారంతో తయారు చేసిన ప్రొడక్ట్స్ చర్మానికి సేఫ్ గా ప్రభావవంతంగా ఉంటాయనీ ఓత్రి ప్లస్ ప్రొఫెషనల్ ఫేషియల్స్ హెడ్ వినీత్ కపూర్ అన్నారు.కాఠియావార్ స్టోర్స్ ఆధ్వర్యంలో, కెఎస్ ప్రొఫెషనల్ – సలోన్ ఎక్విప్మెంట్ స్టోర్ లో ఓత్రి ప్లస్ స్కిన్ సొల్యూషన్ ఫేషియల్ కార్యక్రమం నిర్వహించారు.ప్రత్యేక చర్మ సమస్యలకు వేపలు మెలాస్మా, ట్యాన్, డ్రైనెస్ లాంటి చర్మ సమస్యలకు తగిన విధంగా డిజైన్ చేసి వేర్వేరు కిట్‌లు ఉంటాయన్నారు. ఇంటర్నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్స్ తో తయారవుతాయన్నారు. జెన్యూయిన్ క్లోజ్ టు క్లినికల్–గ్రేడ్ పదార్థాలు వాడుతారాని, స్కిన్ కేరు ట్రీట్‌మెంట్‌ను ప్రొఫెషనల్ మసాజ్, క్లీన్సింగ్, స్క్రబ్బింగ్ మాస్క్‌తో కలిపి ఉత్తమ అనుభవాన్ని అందిస్తారనీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యూర్ కపూర్, ఈ కార్యక్రమానికి కాఠియావార్ స్టోర్స్ హెడ్స్ మయూర్ దోషీ, సచిన్ దోషీ, దేవాంగ్ దోషీ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్య లు పరిష్కరించాటానికే రెవిన్యూ సదస్సులు

**రేషన్ దుకాణాలను తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు**



**తెలంగాణ వీణ,సూర్యాపేట...**

భూ సమస్యలను పరిష్కరించటానికే రెవిన్యూ సదస్సులను నిర్వహించటం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. బుధవారం మేళ్లచెర్వు మండలం రేవూరు, హుజూర్నగర్ టౌన్ హాల్ లో జరుగుతున్న రెవిన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయి లో సమస్యలు తెలుసుకునేందుకు జూన్ 3 నుంచి జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సుల ద్వారా రైతులు తమ సమస్యను ధరఖాస్తు రూపంలో సమర్పించాలని తదుపరి క్షేత్ర స్థాయి లో విచారణ చేసి సమస్య పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు.భూభారతి చట్టం ఏప్రిల్ 14న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొనిరాగా ఆ తర్వాత మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి రాష్ట్రములోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్ట్ గా , రెండో దశలో మే 5 నుంచి జిల్లాకి ఒక మండలం పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా గరిడేపల్లి మండలంలో 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజల నుండి దగఖాస్తులని స్వీకరించామని తెలిపారు.అట్టి ధరఖాస్తులు క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. రేవూరు, మేళచెర్వు గ్రామంలోని రేషన్ దుకాణాలు తనిఖీ చేసి ప్రజలు ఇబ్బందిపడకుండా సన్నబియ్యం పంపిణీ చేయాలని రేషన్ డీలర్లను ఆదేశించారు. తదుపరి మేళ్లచెరువు లోని శ్రీనివాస సాయి శివయ్య రైస్ మిల్లుని, అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, నాగార్జున రెడ్డి,ఆర్ ఐ లు సుశీల, మోషీన్ బాబా, జానకిరాంరెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆసరా.

**పెండ్యాల మాజీ సర్పంచ్ మంత్రి సంధ్యా రాజేష్.**



**తెలంగాణ వీణ,మహేశ్వరం...**

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు ఆసరా లాంటిదని పెండ్యాల మాజీ సర్పంచ్ మంత్రి సంధ్యా రాజేష్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు యాచారం లావణ్య అశోక్ కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎండి గౌస్, నాయకులు కన్నా రెడ్డి, నరేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, దాసరి అంజయ్య, యాచారం దశరథ, భూత్ అధ్యక్షుడు మంత్రి శివకుమార్, మంత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**-ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం! కదులుదాం! కాపాడుదాం!!.**

**-సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి సురేందర్**




**తెలంగాణ వీణ,హైదరాబాద్...**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం (వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే)ను ప్రతి సంవత్సరం జూన్ 5 తేదిన జరుపుకుంటున్నారు. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి అవసరమైన ప్రపంచ అవగాహనను పెంచడానికి ఈ రోజున కొన్ని చర్యలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇది యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ (యుఎన్ఈపి) ద్వారా నడపబడుతుంది. ఈ రోజున మానవ మనుగడ కోసం పర్యావరణం యొక్క ప్రభావం పై ఐక్యరాజ్యసమితి సమావేశం ప్రారంభించింది. 1972 జూన్ 5 వ తేది నుంచి 16 వ తేది వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశం అయింది. ఈ సందర్భంగా 1972 లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏర్పాటు చేయబడింది. 1973 లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవము ను జూన్ 5 వ తేదిన ప్రతి సంవత్సరం ఒక్కో అంశం పై అవగాహన కల్పించేలా ప్రాధాన్యతను ఇస్తూ థీమ్ పెట్టుకోవడం జరుగుతుంది. ఈ సంవత్సరం థీమ్ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం అనే అంశంపై కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని సేవ్ ఎర్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పర్యావరణమిత్ర అవార్డ్ గ్రహీత డాక్టర్ టి సురేందర్ తెలిపారు. అదేవిధంగా వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ను అంతర్జాతీయ స్థాయిలో వైభవంగా జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణం గురించి పర్యావరణాన్ని విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ వాడకం, గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు గురించి మాట్లాడుకునేలా చేయడం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ పునర్వాడకం (రీసైక్లింగ్) కోసం కృషి చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఎన్జీవోస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో నేడు జిల్లెలగూడ చెరువు సమీపంలో పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేద్దాం చేస్తాం అని ప్రతిజ్ఞ చేస్తూ అవగాహన కల్పిస్తూ దాదులుదాం కాపాడుదాం అంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ రక్షకులు, ప్రకృతి ప్రేమికులు, సహజ వనరుల సంరక్షకులు హాజరు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. టెక్నోరైడ్ సంస్థ వ్యవస్థాపకులు రఘుశ్రీ లీడ్ తో సేవ్ ఎర్త్ ఫౌండేషన్, అభ్యుదయ ఎడ్యుకేషనల్ సొసైటీ, మమతల కోవెల మల్టీపర్పస్ కో ఆపరేటివ్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ, స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ, మన ఫౌండేషన్, మమత ఎడ్యుకేషనల్ సొసైటీ, వి ఫౌండేషన్, శ్లోక వాఫ్జన్ ఫౌండేషన్ తదితర సంస్థలు పాల్గొనుచున్నాయని తెలియజేశారు.

# దోపిడీ లేని వ్యవస్థ రావాలంటే కమ్యూనిస్టు పార్టీ పోరాటాల తోనే సాధ్యం






**-కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి**

**....ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

**తెలంగాణ వీణ,మిర్యాలగూడ...**

ఆర్థిక సమానత్వం కోసం ఒక మనిషినీ ఇంకొక మనిషి దోపిడీ చేయని సమసమాజ స్థాపనకోసం పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. బుధవారం మిర్యాలగూడ మండలం యాద్గార్పల్లి గ్రామంలో జరిగిన సిపిఐ 10వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పెట్టుబడిదారులు, దోపిడీ దారులు, సమాజంలో అసమానతలు విపరీతంగా పెరిగి ధనికులు, మరింత ధనికులుగా పేదవాళ్లు మరింత పేదవాళ్లుగా ఆర్థిక అంతరాలు పెరిగిపోయి పేదరికం సమాజంలో విలయతాండవం చేస్తుందని పెట్టుబడి దారి వ్యవస్థ యొక్క లక్షణం అసమానతలను పెంచి పోషిస్తుందని ఈవిధానాలకు ప్రత్యామ్నాయంగా ఈ సమాజంలో అసమానతలు పోవాలంటే, దోపిడి పోవాలంటే అసమానతలు లేని, దోపిడీ లేని వ్యవస్థ రావాలంటే అది కమ్యూనిస్టు పార్టీ పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. అసమానతలు లేని సమ సమాజ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం పోరాటం తప్పదని సోషలిజం సమ సమాజం కోసం అవిశ్రాంత పోరాటం భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తుందని పేదల తరఫున కష్టజీవుల తరఫున నిరంతరం ఉద్యమాలు నిర్వహించి అసమానతలు లేని సమాజం కోసం పేదల పక్షాన నిలబడి విప్లవ పోరాటాల చరిత్ర కమ్యూనిస్టుల సొంతమని, నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించే కమ్యూనిస్టు ఉద్యమాలలో ప్రజలు అధిక సంఖ్యలో మరింత చైతన్యవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికలలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని, ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిచోట సిపిఐ పార్టీ అభ్యర్థులను గెలిపించుటకు కృషి చేయాలని కోరారు. ఈ మహాసభలో మండల కార్యదర్శి ఎండి సయీద్, దామరచర్ల మండల కార్యదర్శి డి లింగనాయక్, వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదయ్య, మరియు బిళ్ళ కనకయ్య, బంటు రాజేశ్వరి, రామలింగం, జి,యాదగిరి,పద్మ, శాంత, వలపట్ల వెంకన్న, జి మట్టయ్య, ముత్తు, జగన్, సైదమ్మ, రమేష్ , రాములు, మర్తమ్మ, అనిత, ఇద్దయ్య, రాములు, లక్ష్మీ,దనమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ ను మెరుగు పరచండి

**-తల్లుల సంఘం వినతి**



**తెలంగాణ వీణ,హైదరాబాద్...**

భారతీయ జనతా పార్టీ నిర్వహించిన “ ప్రజా సమస్యలపై బి జె పి భరోసా “ కార్యక్రమం లో భాగంగా శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి కి సంక్షోభంలో ఉన్న విద్యా వ్యవస్థను మరియు రాష్ట్రంలో దిగజారిన విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవాలని మెమోరండం అందజేయడం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో 2024 – 25 లో 6-14 సంవత్సరాల వయసుగల మొత్తం 62,05,041 మంది పిల్లలలో దాదాపు 25,10,527 (40.46%) మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఉండగా ప్రైవేట్ పాఠశాలలో 36, 94,514 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వహణపై చట్టబద్ధ నియంత్రణ అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ విద్యాశాఖ, ఏసీఈఆర్టీ సంయుక్తంగా మూడవ తరగతి విద్యార్థులకు చేసిన అసిస్మెంట్ నివేదికలో కేవలం 12% మంది పిల్లలు మాత్రమే రాయడం, చదవడం చేయగలుగుతున్నారని 15% మంది పిల్లలు మాత్రమే సంఖ్యలను గుర్తిస్తున్నారని ఈ నివేదిక తెలియజేస్తుంది. జిల్లాల వారీగా చూసినట్లయితే ఇంకా కొన్ని జిల్లాలు రాష్ట్ర సగటు కంటే చాలా వెనుకబడి ఉన్నారు.అలాగే నేషనల్ అచీవ్మెంట్ సర్వే (న్యాస్) 2021 నివేదిక ప్రకారం 8 వ తరగతి విద్యార్థులు తెలుగులో 48% మరియు గణితంలో 32% మంది విద్యార్థులే తరగతికి తగ్గ సామర్థ్యాలు ఉన్నాయని తెలిసింది. ఎస్సీ ,ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు ఇంకా ఆందోళన చెందే విధంగా ఉన్నాయి. కావున ఈ విద్యా సంక్షోభ పరిస్థితిని విద్యా ఎమర్జెన్సీగా పరిగణించాలి. ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు చేపట్టాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక, తల్లుల సంఘం అధ్వర్యంలో మేమొరండము అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ జి .వేణుగోపాల్, కో కన్వీనర్ పెండం లక్ష్మిన్, జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మి నారాయణ ,తల్లుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ దశరథ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

# మళ్లీ లక్షకు చేరువలో బంగారం ధర.. భారీగా పెరుగుతున్న పసిడి

**తెలంగాణవీణ, బిజినెస్ న్యూఢిలీ**

బంగారం ధరలు రోజురోజుకు ఎగబాకుతున్నాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు అంతకు రెండింతలు పెరుగుతోంది. తాజాగా నిన్న రూ.98,850 ఉన్న బంగారం ధర ప్రస్తుతం లక్షకు చేరువలో కొనసాగుతోంది. జూన్ 4 బుధవారం రూ.99,070 వద్ద ఉంది ఇక వెండి ధర విషయానికొస్తే లక్షా 200 రూపాయలు ఉంది. ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు లేదా స్థిరంగా కొనసాగవచ్చు. దేశంలోని ప్రధాన నగరాల్లో ధరల వివరాలు తెలుసుకుందాం.



చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,960 ఉంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.

కేరళలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.99,070 ఉండగా, అదే 24 క్యారెట్ల ధర 90,810 ఉంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో బులియన్ మార్కెట్ రేట్లు మన దేశంలో బంగారం ధరలపై ప్రభావం చూపుతాయి. ఇంకా అమెరికా డాలర్, రూపాయి మారక విలువ కూడా ఎఫెక్ట్ చూపిస్తుంది. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు కూడా బంగారం ధరలను నిర్ణయిస్తాయి. అందుకే గోల్డ్ ధరలు స్థిరంగా ఉండవు. ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి.

# టాటా హారియర్ ఈవీ వచ్చేసిందోచ్

## ప్రారంభ ధర రూ.21.49 లక్షలు
## సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు




**తెలంగాణవీణ, బిజినెస్ న్యూఢిల్లీ,**

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో నూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది.పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్-జోన్ ట్కక్లైమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తిస్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నా యి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.

# మరో నయా ఈవీ స్కూటర్ లాంచ్‌కు బజాజ్ సిద్ధం.. ఈ నెలలోనే రిలీజ్..?

**తెలంగాణవీణ, బిజినెస్ న్యూఢిలీ**

బజాజ్ కంపెనీ జూన్ నెలలో బడ్జెట్ ఫ్రెండ్లీ చేతక్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బజాజ్ ఆటోకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ కంపెనీ ఆదాయాల సమావేశంలో చేతక్ 2903 మోడల్‌కు అప్‌డేటెడ్ వెర్షన్‌పై కంపెనీ పని చేస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త మోడల్ బజాజ్ ఈవీ అధికారికంగా జూన్‌లో ప్రారంభం కానుందని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం చేతక్ 2903, 3501, 3502, 3503 పేర్లతో నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంది. క్యూ4లో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలో అమ్మకాల చార్టుల్లో అగ్రస్థానంలో నిలిచిన తర్వాత బజాజ్ దాని సరసమైన శ్రేణిని మరింత వైవిధ్యపరచాలని కోరుకుంటోంది. చేతక్ బ్రాండ్‌కు



పెరుగుతున్న ప్రజాదరణ నేపథ్యంలో నాలుగో త్రైమాసికంలో భారతదేశ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో చేతక్‌ను నంబర్ వన్ స్థానానికి చేరింది. బజాజ్ ఈ-స్కూటర్ మార్కెట్‌లో 29 శాతం వాటాను కైవసం చేసుకుంది.బజాజ్ చేతక్ 2903 వెర్షన్ 2.9 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 123 కి.మీ.ల రేంజ్ తో పనిచేస్తుంది. ఇది 4 గంటల్లో 100 శాతం ఛార్జ్ అవుతుంది. అలాగే ఈ స్కూటర్ గరిష్టంగా 63 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని చెబుతున్నారు. అలాగే ఈ స్కూటర్ హిల్ హెూల్డ్‌తో పాటు రెండు రైడ్ మోడ్‌లను కలిగి ఉంటుంది. ఈ స్కూటర్ ధర ధర రూ. 98,498(ఎక్స్-షోరూమ్) ఉంటుంది. అయితే కొత్త అప్‌డేటెడ్ వెర్షన్ 35 సిరీస్ బ్యాటరీతో 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 153 కి.మీల పరిధితో వస్తుందని భావిస్తున్నారు. 35 సిరీస్ 3503కు సంబంధించిన ఎంట్రీ-లెవల్ మోడల్ ఆధారంగా కొత్త వేరియంట్ 35 లీటర్ల బూట్ స్పేస్, పెద్ద అండర్-సీట్ స్టోరేజ్, 63 కిలోమీటర్ల వరకు టాప్ స్పీడ్‌ను పొందవచ్చని అంచనా వేస్తున్నారు అలాగే బజాజ్ నయా స్కూటర్ ఇది 3 గంటల 25 నిమిషాల్లో 0 %-% 80 శాతం వరకు ఛార్జ్ అవుతుందని, అలాగే 151 కి.మీ.ల పరిధిని అందిస్తుందని వివరిస్తున్నారు. ఈ స్కూటర్‌లో రెండు రైడ్ మోడ్‌లు ఉంటయి.

# ఐపీఎల్‌లో లక్నో వైఫల్యం.. వరల్డ్ కప్ హీరోపై వేటు తప్పదా..!

**తెలంగాణవీణ, క్రీడలు :**

ఐపీఎల్ 18వ సీజన్ ముగిసి రెండు రోజులైనా కాలేదు.. అప్పుడే కొన్ని జట్లు కోచింగ్ సిబ్బందిని మార్చే పనిలో పడ్డాయి. వరుసగా రెండు సీజన్లలో నిరాశపరిచిన లక్నో సూపర్ జెయింట్స్ తమ టీమ్‌లో మార్పులకు సిద్ధమవుతోంది. తమ ఫ్రాంచైజీ నిరుడు, ఈ ఏడాది ప్లే ఆఫ్స్ చేరకపోవడంతో చైర్మన్ సంజీవ్ గొయెంకా అసంతృప్తిగా ఉన్నాడట. సో.. కోచింగ్ స్టాఫ్‌లోని కొందరిపై వేటు పడనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. వీళ్లలో మెంటార్ జహీర్ ఖాన్ పేరు కూడా ఉండచవచ్చని లక్నో వర్గాలు చెబుతున్నాయి.టీమిండియా 2011లో వరల్డ్ కప్ గెలుపొందిన జట్టులో సభ్యుడైన జహీర్ ఖాన్ నిరుడు లక్నో కోచింగ్ యూనిట్‌లో చేరాడు. హెడ్‌కోచ్ జస్టిన్ లాంగర్‌తో కలిసి మెంటార్‌గా వ్యూహరచనలు చేశాడీ మాజీ పేసర్. అయితే.. 18వ సీజన్‌లో లక్నో తీవ్రంగా నిరాశపరిచింది. ఆరంభంలో అదరగొట్టినా.. కీలక




మ్యాచుల్లో ఓడిపోయింది. 14 మ్యాచుల్లో ఆరు విజయాలతో ప్లే ఆఫ్స్ బెర్తుకు దూరమైంది.వేలంలో రికార్డు ధర పలికిన కెప్టెన్ రిషభ్ పంత్ ఆఖరి మ్యాచ్‌లో సెంచరీ మినహా పెద్దగా రాణించలేదు. అతడిని సానబెట్టడంలో మెంటార్‌గా జహీర్ విఫలమయ్యాడని సంజీవ్ గొయెంకా భావిస్తున్నాడు. అయితే.. ఈ సీజన్‌లో భయం లేకుండా చెలరేగి ఆడాలని అనుకున్న లక్నో మైదానంలో మాత్రం తేలిపోయింది. మరోవైపు హిట్టర్ నికోలస్ పూరన్, మిడిలార్డర్‌లో సమద్ తేలిపోవడంతో ఆ జట్టు విజయావకాశాలం దెబ్బతిన్నాయి. దాంతో, వచ్చే సీజన్‌కు పక్కాగా సన్నద్ధం కావాలనే ఆలోచనతో ఉన్న ఆయన.. కొత్త మెంటార్ కోసం చూస్తున్నాడని టాక్. అదే నిజమైతే లక్నో మెంటార్‌గా జహీర్ పదవీ కాలం ఒక్క ఏడాదితో ముగియనుంది.

# టీమిండియాతో సిరీస్.. ఇంగ్లండ్‌ను వెంటాడుతున్న బౌలింగ్ కష్టాలు..!

**తెలంగాణవీణ, క్రీడలు :**

ఇంగ్లండ్ జట్టుకు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. టీమిండియాతో ఐదు టెస్టుల సిరీస్‌ను విజయంతో ఆరంభించాలనే కసితో ఉన్న ఆతిథ్య జట్టుకు బౌలింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పేసర్ మార్క్‌వుడ్, జోఫ్రా ఆర్చర్ గాయపడ్డారు. క్రిస్ వోక్స్ సైతం ఫిట్‌నెస్ కోసం నానా పాట్లు పడుతున్నాడు. అంతలోనే యువ పేసర్ గస్ అట్కిన్సన్ సైతం గాయం పడ్డాడు. దాంతో ఇండియాతో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. కండరాల గాయం తో బాధపడతున్న ఈ స్పీడ్‌స్టర్ కోలుకునేందుకు సమయం పట్టడనుంది. సో.. జూన్ 20 మొదలయ్యే మొదటి టెస్టులో అతడు ఆడడం దాదాపు అసాధ్యమే.యువ పేసర్ గస్ అట్కిన్సన్ కుడి కాలి తొడకండరాల



గాయంతో ఇబ్బంది పడుతున్నాడు. అతడు ఇండియాతో జూన్ 20న జరుగబోయే తొలి టెస్టుకు దూరమయ్యే అవకాశముంద'ని ఇంగ్లండ్ బోర్డు తెలిపింది. స్వదేశంలో జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టులో అట్కిన్సన్ గాయపడ్డాడు. దాంతో.. అతడు వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు.ఇప్పుడు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ కొత్త సీజన్‌లో భాగంగా టీమిండియాతో సిరీస్‌కు అతడు అందుబాటులో ఉండకపోవచ్చు. ఒకవేళ తొలి టెస్టులోపు అట్కిన్సన్ కోలుకొని, ఫిట్‌నెస్ సాధించకుంటే ఇంగ్లండ్‌కు వైవిధ్యమైన పేస్ బౌలర్ కొరత ఏర్పడనుంది. నిరుడు వేసవిలో అరంగేట్రం చేసిన అట్కిన్సన్ 12 మ్యాచుల్లోనే 55 వికెట్లు పడగొట్టాడు.

# స్పోర్ట్స్

# ఐసీసీ ట్రోఫీల వీరుడి కల సాకారం..

## ఐపీఎల్ టైటిల్‌తో కోహ్లీ 'సిక్సర్'..!



**తెలంగాణవీణ, క్రీడలు :**

భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ కల సాకారమైంది. టీమిండియా ఆటగాడిగా పలు ఐసీసీ ట్రోఫీలు గెలుపొందిన విరాట్.. ఐపీఎల్‌లోనూ 'ఛాంపియన్' అనిపించుకున్నాడు. 17 ఏళ్లుగా తనను ఊరిస్తూ వస్తున్న ట్రోఫీని అహ్మదాబాద్ స్టేడియంలో ఎంతో మురిపెంగా చేతపట్టుకున్నాడు విరాట్. తన సుదీర్ఘ కెరియర్‌లో అందని ద్రాక్షలా మిగిలిన ఐపీఎల్ ట్రోఫీతో విరాట్ చేసిన సంబురం అంతా ఇంతా కాదు. ఆటగాడిగా ఎన్నో మైలురాళ్లు, రికార్డులు అధిగమించిన భారత క్రికెట్ స్టార్ వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ గెలుపొందిన భారత జట్టులో సభ్యుడు. ఐపీఎల్ విజేతగా నిలిచిన అతడి ఖాతాలోని టైటిళ్ల సంఖ్య ఆరుకు చేరిందిటీమిండియా తరఫున విజయవంతమైన ఆటగాళ్లలో ఒకడైన కోహ్లీ ఐసీసీ ట్రోఫీల వీరుడిగా పేరుగాంచాడు. అండర్ -19 వరల్డ్ కప్ (U-19 World Cup 2008) హీరోగా సీనియర్ జట్టులోకి వచ్చిన అతడు.. అనతికాలంలోనే కీలక ఆటగాడిగా ఎదిగాడు. స్వదేశంలో జరిగిన 2011లో వన్డే వరల్డ్ కప్‌తో తొలి ఐసీసీ టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు కింగ్. 2013లో ఛాంపియన్స్ ట్రోఫీ, 2024లో టీ20 వరల్డ్ కప్, 2025లో ఛాంపియన్స్ ట్రోఫీ గెలుపొందని జట్టులో సభ్యుడైన కోహ్లీ.. ఇప్పుడు ఐపీఎల్ ట్రోఫీతో సిక్సర్ కొట్టాడు.




# ఇంట్రెస్టింగ్‌గా ‘మాలిక్’ టీజర్

## గ్యాంగ్‌స్టర్‌గా రాజ్‌కుమార్ రావు..


**తెలంగాణవీణ, సినిమా :**
బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘మాలిక్ గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాకు పుల్కిత్ దర్శకత్వం వహిస్తుండగా.. టిప్స్ ఫిల్మ్స్, నార్తర్న్ లైట్స్ ఫిల్మ్స్ బ్యానర్లపై కుమార్ తౌరానీ, జే షెవాక్రమణి నిర్మిస్తున్నారు. మానుషి చిల్లర్ కథానాయకగా నటిస్తుండగా.. ప్రసేన్‌జిత్ ఛటర్జీ, మేధా శంకర్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూలై 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్.టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం 1988 అలహాబాద్ నేపథ్యంతో కూడిన అండర్‌వరల్డ్ డ్రామాగా తెరకెక్కినట్లు తెలుస్తోంది. సామాన్య యువకుడి నుంచి ఒక వ్యక్తి గ్యాంగ్‌స్టర్‌గా ఎలా మారాడు అనేది ఈ సినిమా స్టోరీ అని సమాచారం. రాజ్‌కుమార్ రావు గతంలో చేసిన కామెడీ లేదా సాఫ్ట్ పాత్రలకు భిన్నంగా, పూర్తిగా క్రూరమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో ఇందులో కనిపించబోతున్నాడు.

# హాట్ బ్యూటీని దింపుతున్న నీల్..?

## డ్రాగన్ లో స్పెషల్ సాంగ్..



**తెలంగాణవీణ, సినిమా :**
మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటిస్తున్న చిత్రాల్లో ఎన్టీఆర్– నీల్ ఒకటి. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ ఏడాదిలోనే పూజా కార్యక్రమాలను జరుపుకున్న ఈ సినిమా టైటిల్ డ్రాగన్ అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తెల్సిందే దేవర తరువాత ఎన్టీఆర్ ఒకపక్క వార్ 2 ..ఇంకోపక్క డ్రాగన్ షూట్స్ లో బిజీగా మారాడు. డ్రాగన్ పై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. నీల్ కూడా ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా పనిచేస్తున్నాడు. ఈ చిత్రం గురించి ఏ చిన్న అప్డేట్ వచ్చినా కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. తాజాగా డ్రాగన్ కు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. మొదటి నుంచి ఈ చిత్రంలో ఒక స్పెషల్ సాంగ్ ఉంటుందని వార్తలు వినిపిస్తున్న విషయం తెల్సిందే. ఈ సాంగ్ కోసం స్టార్ హీరోయిన్ల వేట మొదలుపెట్టాడట ప్రశాంత్ నీల్. మొదట బాలీవుడ్ బ్యూటీస్ ని రంగంలోకి దింపాలని ప్రయత్నించారట. కానీ, చివరకు రొమాంటిక్ భామ అయితే ఇంకా హైప్ పెరుగుతుందని కేతిక శర్మ ను ఓకే చేసినట్లు సమాచారం. రొమాంటిక్ సినిమాతో కేతిక టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. మొదటి సినిమాతోనే అమ్మడు మంచి హిట్ అందుకుంటుంది అనుకున్నారు .. కానీ, లక్ కలిసిరాలేదు. ఆ తరువాత కుర్ర హీరోల సరసన కనిపించినా కూడా కేతికకు విజయం దక్కలేదు. ఇక ఆ సమయంలోనే రాబిన్ హుడ్ సినిమాలో అదిదా సర్ప్రైజ్ అంటూ ఒక స్పెషల్ సాంగ్ చేసింది. ఈ సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేసింది. కేతిక అందానికి, స్టెప్స్ కు ఫ్యాన్స్ ముగ్దులు అయ్యారు. ఆ హైప్ తోనే ఆమె నటించిన సింగిల్ కూడా మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఇప్పుడు అదిదా సర్ప్రైజ్ సాంగ్ ను చూసిన ప్రశాంత్ నీల్ ఇంప్రెస్ అయ్యి.. డ్రాగన్ లో స్పెషల్ సాంగ్ కు ఓకే చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కేతికతో సంప్రదింపులు జరపగా ఆమె వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందని సమాచారం. ఇదే కనుక నిజమైతే కేతిక పంట పండినట్లే.



# ఆ హీరోయిన్ అంటే నాకు పిచ్చి.. ఆమెతో నటించాలని ఉంది..

## మనసులో మాట బయటపెట్టిన దుల్కర్

**తెలంగాణవీణ, సినిమా :**
సినీప్రియులు అత్యధికంగా ఇష్టపడే సౌత్ హీరోలలో దుల్కర్ సల్మాన్ ఒకరు. ఎన్నో హిట్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ స్టార్ హీరో.. ఇప్పుడు లక్కీ భాస్కర్ సినిమాతో మరో విజయాన్ని అందుకున్నాడు. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా వసూల్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇదెలా ఉంటే.. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దుల్కర్ సల్మాన్ తన కెరీర్ గురించి కాకుండానే పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అలాగే తనకు ఓ హీరోయిన్ తో నటించాలని ఉందని వెల్లడించారు.ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ అందాల తార కాజోల్. ఎన్నో హిట్ చిత్రాల్లో కాజోల్ తన పాత్రలకు ప్రాణం పోసిన తీరు ఎంతో అందంగా ఉంటుందని తెలిపాడు దుల్కర్. కాజోల్ పోషించే పాత్రలకు అన్ని భావోద్వేగాలను ప్రేక్షకులు నిజంగా అర్థం చేసుకోగలరని అన్నారు. ‘నాకు కాజోల్‌తో నటించాలని ఉంది. ప్రతి సినిమాలో ఆమె పాత్రలను చూపించిన తీరు అద్భుతం. తన పాత్రలకు ఎంత అందంగా జీవం పోస్తుంది. ప్రేక్షకులు తమ ప్రతి కథలోని భావోద్వేగాలను సరిగ్గా అర్థం చేసుకోగలరు. ఆమె నవ్వితే గుండెల్లో నుంచి నవ్వినట్లుగా అనిపిస్తుంది. ఇక ఆమె ఏడ్చే పాత్రలు అదే ఎమోషనల్ రోల్స్ చేస్తే నిజంగానే జరిగిందా అన్నట్లుగా కనిపిస్తుంది. ఆమె పాత్రలను అంత చిత్తశుద్ధితో పోషిస్తుంది ‘ అన్నారు దుల్కర్ సల్మాన్.దుల్కర్ సల్మాన్ చివరిగా నటించిన చిత్రం లక్కీ భాస్కర్. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్‌పై ఎస్ నాగ వంశీ, సాయి గ్రియ నిర్మించారు. ఇప్పుడు మరోసారి తెలుగు దర్శకుడితో సినిమా చేస్తున్నాడు దుల్కర్ సల్మాన్. తెలుగులో డెబ్యూ డైరెక్టర్ రవి దర్శకత్వంలో ఓ సినిమాలో నటించబోతున్నాడని, ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ నిర్మించబోతున్నారని టాక్ నడుస్తుంది. ఈ సినిమాలో పూజా హెగ్డే నటించే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది.



# గోల్డెన్ శారీలో మెరిసిపోయిన సమంత

## దుబాయ్ ఈవెంట్‌లో సమంత ఫొటోలు వైరల్..

**తెలంగాణవీణ, సినిమా :**
టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయం, నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఇక పలు అనారోగ్య కారణాలతో ఇటీవలే సినిమాలకు కాస్త బ్రేక్ తీసుకున్న సామ్.. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వచ్చింది. వరుస ప్రాజెక్టులతో బిజీగా మారిపోయింది. వరుస పెట్టి సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేస్తోంది. అదే సమయంలో ఈవెంట్స్‌లో పాల్గొంటూ సందడి చేస్తోంది.తాజాగా సమంత దుబాయ్‌లో సందడి చేసింది. అక్కడ జరిగిన ఓ స్పెషల్ ఈవెంట్‌కు చాలా స్పెషల్‌గా ముస్తాబై వచ్చింది. ఎంబ్రాయిడరీ నెట్ గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయింది. సింపుల్ మేకప్, హెయిర్ స్టైల్‌తో తన లుక్‌కు మరింత అందంగా మార్చుకుని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సామ్‌ను చూసేందుకు అభిమానులు పోటీ పడ్డారు. వారందరితో సమంత ఫొటోలు, సెల్ఫీలకు ఫోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను సామ్ తన ఇన్‌స్టా వేదికగా అభిమానులతో పంచుకుంది. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ ఆకట్టుకుంటున్నాయి. ఇక సినిమాల విషయాని కొస్తే.. టాలీవుడ్‌లో సమంత సినిమా వచ్చి రెండేళ్లవుతోంది. చివరిసారిగా విజయ్ దేవరకొండతో కలిసి ‘ఖుషి’ చిత్రంతో పలకరించిన ఈ బ్యూటీ ప్రస్తుతం ‘మా ఇంటి బంగారం’ అనే మూవీ చేస్తోంది. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో ‘రక్త్ బ్రహ్మాండ్’ అనే ప్రాజెక్ట్‌లోనూ భాగమైంది. తాను నిర్మాతగా వ్యవహరించిన తొలి చిత్రం ‘శుభం’. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమా గతనెల 9న ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. హారర్ థ్రిల్లర్ జానర్‌లో వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తాజాగా ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ చిత్రం జూన్ 13 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written